కథానిక

# సుఖాంతం

"వల్లపురెడ్డి"

"నేను సచ్చిపోతే నువ్వూ, బుల్లోడూ ఏమవుతారు?" మంచంమీద పడుకుని, ఫాలం మీద ఆసుపత్రినుంచి తెచ్చిన తైలాన్ని రాస్తూన్న పెళ్ళాం రామిని ప్రశ్నించాడు సత్తిగాడు. ఆమె వదనంలోకి చూస్తూ పొడినవ్వు నవ్వాడు.

"ఏమిటీ పిచ్చివాగుడు? నీకెప్పుడూ చావు గోడవే. ఛీ, ఊరుకో. ఈమాత్రందానికే సచ్చిపోతారా?" అంది రామి ఇంకా నొసలురాస్తూనే. ఆమె ముఖం విషాదావగుంఠితమై ఉంది.

"సత్తానంటే వస్తుందా సావు? అట్లా వస్తే బావుండేది. నాలాగ కష్టపడేవాళ్ళంతా ఒక్కసారే సచ్చిపోదురు. అదీ మనలాంటోళ్ళకు ఆసలే రాదు. అన్నీవుండి సుకంగా ఉన్నోళ్ళకే ఆ చావుతల్లి కన్పిస్తుంది; కాని తింటానికి మెతుకులేని మనల్ని కన్నైనా ఎత్తిసూడదు. పల్కరించను గూడా పల్కరించదు!" అన్నాడు.

ఆలాంటి మాటలు రామి ఎన్నోసార్లు వింది. విన్నప్పుడల్లా ఆమె చావు ప్రశంస తీయవద్దని మందలించటమూ, వాడు చావు తమకు ఆమెడల దూరాన ఉందనటమూ మామూలే. రెండుసంవత్సరాల క్రితం ఆమె గర్భంతో ఉన్నప్పుడు సుస్తీ చేసింది. ప్రభుత్వ ఔషధాలయంలో మందు రూపకంగా ఇచ్చే రంగునీళ్ళు నిత్యమూ తేలేక విసుక్కునే వాడు సత్తిగాడు. తిరగలేక కాదు; ఎన్నాళ్ళనుండి మందు త్రాగుతున్నా జ్వరం నయం కాకపోవటమే అందుక్కారణం. ప్రసవదినాలు సమీపిస్తూన్నకొద్దీ ఎక్కువగా యాతనపడసాగింది. ఆ బాధను ఓర్చుకోలేక తాను మరణిస్తే ఎంతో బావుండుననుకునేది. ఒకనాడా మాట బయటకూడా అనేసింది. దగ్గరే ఉన్న సత్తిగాడు ఇప్పుడన్నమాటే అన్నాడు మృత్యుదేవి తమలాంటి గర్భదరిద్రుల్ని ఎన్నడూ కనికరించదని. ఆ సమయంలో రామి అతడి మాట నమ్మలేక పోయినా క్రమంగా నిజమేనని తేలిపోయింది. ఒక పిల్లాడిని ప్రసవించింది. ఆ తరువాత రోగం తెగిపోయింది.

తమ తరగతి జీవులు చుట్టూరా పడుతూన్న బాధల్ని రోజూ గమనిస్తూనేఉంది. ఎంత బాధలు పడుతున్నా చావుమాత్రం త్వరగా రావటంలేదు. పొరుగింట్లో బుచ్చి మొగుడు సుబ్బిగాడు మూడు సంవత్సరాలుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. వాడు మొదట కండరాలు తిరిగి సాము గరిడీలు చేసే వస్తాదులా ఉండేవాడు; ఇప్పుడు వత్తి ఎముకలగూడయ్యాడు. అప్పటికీ వానికి చావు రావటంలేదు. పాపం! పెళ్ళామే కష్టపడి సంపాదించి ఇంత గంజినీళ్ళు కాచిపోస్తూంది. అది కూడా నలుగురు చూట్టానికి పైకి మనిషిలాఉన్నా దారిద్ర్యపు విషపుకాటువల్ల ఏనాడో మరణించింది.

సౌఖ్యాలలో తులదూగే విలాసజీవుల విషయంలో భర్త చెప్పేమాటల్ని గూడా కళ్ళారా చూసింది. ప్రతిరోజూ తను అంట్లు తోమటానికి, వాకిలి ఊడ్చటానికి వెళ్ళే నవాబుపెళ్లానికి గండు చీమ కరచి రెండోరోజునే పరలోకంచేరింది. గొప్ప గొప్ప డాక్టర్లంతా చేతులు పిసుక్కున్నారు. రామికి ఇంట్లో చీమలూ, నల్లులేకాకుండా ఒక్కోసారి తేళ్ళు కూడా కుట్టిపోతుంటాయి. కాని ప్రాణాలు పోవటం అటుంచి పట్టుమని ఒక్క రోజుకూడా బాధపెట్టవు. ఏదో కొన్నిగంటల బాధ; తరువాత నివారణ: మందులూ, డాక్టర్లూ అక్కరలేకండానే. భాగ్యవంతుల పట్ల మృత్యుదేవి ప్రసన్నతను ఎన్నోసార్లు చూసింది.

"సరే, నువ్వు కదలకండా పడుకో. నేనెల్లి అంట్లు తోమిపెట్టి వత్తాను. బేగివత్తా!" అంటూ లేవబోయింది. సత్తిగాడామె చేయిపట్టుకున్నాడు.

"ఇదో, నాకు కాలువిరిగినప్పటినుంచీ నీవూ కష్టపడుతున్నావు. వాళ్ళు ఒక్కపూట పెట్టే అన్నంలో నాకూ పెడ్తున్నావు. నేనంటే ఒక్కచోట పడుంటా; నా కాకలేయదు. కాని నీవు పని చేసేదానివి. పస్తులుంటే ఎట్టాగు...? ఎంత సగమైనావు సూడు." అంటూ బుగ్గలనూ చేతులను నిమిరాడు. "నేను బాగున్నప్పుడు

ఇద్దరమూ రెండు పూటలా ఎట్లాగో కడుపు నింపుకుని బుల్లోడికి కొంచెం మంచి తిండి పెట్టాం. ఇప్పుడూ...ఏమో! ఈ కాలు కట్టుకుంటుందనే నమ్మకమేంటి? కట్టుకున్నా రిక్షా నడపగలనా? ఇక నీ రెక్కలకష్టంలో పాలుపంచుకుని నీఋణాన పోవాలేమో."

భర్తమాటల్ని రామి వినలేకపోయింది. "ఛీ నీ గొడవనీదే. డాక్టరు చెప్పాడు కదా త్వరగానే కుదురుకుంటుందని. ప్రాణమ్మీది కొచ్చేదైతే ఆనాడే దవాఖానలో ఉంచుకునేవారు. నువ్వు పడుకో. నేనెళ్లివస్తా." అని పిల్లాడిని చంకేసుకుని వెళ్ళిపోయింది.

"హుఁ! మనలాంటోళ్ళకు దవాఖానలో జాగా ఇస్తారా? అధికారం కలవాళ్ళ శరీరంమీది చిన్న సెలవేసినా పెద్దరోగమంటూ డాక్టర్లంతా ఆత్రుతపడతారు. కాని నిర్థనులుకొనప్రాణంతో తంటాలు పడుతున్నా వాళ్ళకేంచాలా బాగున్నారంటారు.' భార్య వెళ్ళిపోయిన దిక్కుకు దీనంగా చూస్తూ అస్పష్టంగా పలికాడు సత్తిగాడు.

పట్టణంలో రిక్షాలాగి జీవితాన్ని దొర్లించుకుపోయేవేలాది జీవుల్లో సత్తిగాడొకడు. యువకుడు; పుష్టిగలవాడు కావటంవల్ల రిక్షాసహాయంతో సంపాదించే డబ్బుతో ఇద్దరూ—తను, తన భార్య—కడుపునిండా తినేవారు. తినేవి రుచ్యపదార్థాలు కాకపోయినా ఆకలిచిచ్చు నార్పి ఆత్మశాంతి కూర్చేందుకు సరిపోయేవి. రెండు వత్సరాలక్రితం పిల్లాడు కలిగినప్పటినుంచీ మరీ జాగ్రత పడాల్సి వచ్చింది. తిండివిషయంలో వాళ్ళు ఎంత కడుపు కట్టినా పిల్లాడికి పాలు వేళకు పట్టకపోయేవారు. రామికి ఊరికే గుడిసెలో కూర్చోవటం భావ్యమనిపించలేదు. అందుకే భర్తకిష్టం లేకపోయినాతానే బలవంతాన వెళ్ళి ఒక ధనికుల ఇంట్లో చాకిరీచేసి ఒక పూటకు సరిపోయే తిండి పట్టుకొచ్చేది. ఆమె మొదటునుంచీ తనూ ఇతరులకు మల్లే కూలిచేసి సంసారానికి చన్నీళ్ళకు వేన్నీళ్లుగా సహాయపడదామని అనుకుంది. కాని సత్తిగాడు భార్యను కష్టపెట్టడానికి సుతరామూ ఇష్టపడడు. సంపాదించాల్సిన బాధ్యత భర్త ఒక్కని భుజస్కంధాలపై ఉండాల్సిందే అని వాని మతం. బుల్లోడు పుట్టక ముందు భర్త పనిమీద వెళ్ళగానే పొరుగింటావిడతో కలిసి ఎవరింటికో వడ్లుదంపటానికెళ్ళిందొకనాడు. అది తెలిసి సత్తిగాడు మండిపడ్డాడు. వారం రోజులదాకా ఆమెతో మాట్లాడనేలేదు. ఆనాడు రామి తనింకెప్పుడూ ఎవరి పనిలోకి వెళ్ళనని వాగ్దానం చేసింది. సత్తిగాడు ఒడంబడ్డాడు: మరెప్పుడైనా నడుం వంచటానికి ఇల్లు విడిస్తే ఇక తెగతెంపులే అనే షరతుపైన.

కాని బుల్లోడు జన్మించాక తమ్ము తాము పోషించుకుంటూ వాడిని సంరక్షించటం కష్టంగా తోచింది. ఒక్కొక్కనాడు పస్తుపడి ఉండాల్సి వచ్చేది. మరుసటిరోజు రిక్షా లాగటానికి శక్తి చాలక బాధపడేవాడు. అయినా సరిపోయినంతగా సంపాదన లేకపోయింది. జీవితంపై విసుగుపుట్టేది. తన చుట్టుప్రక్కల ఉంటూన్నవాళ్ళలో కొందరికి చీమలపుట్టల్లాగ పిల్లలున్నారు. వాళ్ళజీవితాలు ఎట్లా దొర్లుతున్నాయి అనే ఆలోచన వచ్చేసరికి లోపల్నుండి వేడి నిట్టూర్పులు బయటికొచ్చేవి. మళ్ళీ ఏదో ధైర్యంవచ్చి శ్రమించేవాడు. సాయంత్ర ఇంటికొచ్చి పెళ్ళాన్ని, బుల్లోడిని చూసి దైనిక బాధలను విస్మరించేవాడు.

నిత్యమూ గండంగా గడుస్తూంటే చూడలేక రామి మళ్ళీ అడిగింది భర్తను తనూ కొంచెం పని చేస్తానని. సంసారపు లోతుపాతులు కొంచెంగా అర్థమయిన సత్తిగాడు కాదనలేక పోయాడు. ప్రొద్దున పదిగంటలదాకా ఎక్కడైనా పని చేసేందు కనుమతిచ్చాడు. నాటినుండీ కొంచెం సవ్యంగా సాగిపోసాగింది.

రిక్షావాళ్ళ గూడెంలో ఉన్నవాళ్ళలో కల్లా సత్తిగాడు కొంచెంమాటలు నేర్చిన మనిషి. ఏమాట మాట్లాడినా చమత్కారంగానో, భావ నిబిడంగానో ఉండేది. వాని మాటల్ని విన్నవాళ్ళు "పూర్వజన్మాన నువు కయిత్వం రాసే వాడివేమోరా" అంటూండేవాడు. ఆర్ద్రహృదయుల్లో అగ్రగణ్యుఁడు వాడే. ఎవరికి బాధలున్నా పంచుకోవటంలో మొదటివాడు.

అంతలో రిక్షావాళ్లు సమ్మెచేశారు. రిక్షాలో ఒక ప్రయాణీకునికంటే ఎక్కువ పయనించరాదని ప్రభుత్వం కఠోరంగా శాసించింది. సభ్యులు ఎక్కువగాఉన్న సంసారం నిలబెట్టడానికి కొందరు

దాపుగా శాసనధిక్కారం కావించారు. కొందరు పట్టుబడేవారు. రిక్షాకు మూడు మొదలు అయిదు వరకు దండుగ చెల్లించాలి న్యాయస్థానంలో. ప్రతిరోజూ రిక్షా యజమానికి రూపాయన్నర చెల్లించగా మిగిలిన డబ్బులపై జీవితం గడిపే వాళ్ళకు దండుగలు విధిస్తే ఇక చెప్పేదేముంది? రెండుమూడు రోజులు పస్తుపడి రిక్షానడిపితేగాని ఆ దండుగడబ్బులు పూర్తికావు. ఒకనాడు ఒక్క గిరాకీకూడా తగల్లేదు సత్తిగానికి. ప్రొద్దువాలుతూన్నప్పుడు దొరికిన ఇరువురు ప్రయాణీకుల గిరాకీ తీసుకెళ్లాడు. పోలీసుచేతుల్లో చిక్కి దండుగ చెల్లించాడు. ఇలాంటి ఇక్కట్టులకు అందరూ గురికాసాగారు. ప్రభుత్వం శాసనాన్ని, రిక్షావాళ్లెందరు అర్జీలు పెట్టుకున్నా రద్దుపరచలేదు. రిక్షావాళ్ళంతా విసిగి సమ్మెసాగించారు.

"దోసవారికీలియే ఇజాజత్ దో" (ఇద్దరు ప్రయాణీకుల్ని ఎక్కించుకోటానికి అనుమతివ్వాలి) అనే నినాదాలు చేస్తూ అంతా పట్టణంలోని వీధులన్నీ తిరిగారు. ప్రభుత్వ కార్యాలయాన్ని చేరేసరికి పోలీసులు లాఠీఛార్జి చేశారు. చాలా మందికి గాయాలు తగిలినయి. సత్తిగాడి కుడికాలు విరిగింది. నెత్తిమీద బలమైన గాయమే తగిలింది. గాయాలు తగిలిన వాళ్ళను ఆసుపత్రికి చేర్చారు. ఇద్దరు ముగ్గురిని తీసుకున్నారు. మిగతావారిని మందులిచ్చి సీట్లు ఖాళీఅయ్యేదాకా ఉండమన్నారు.

సత్తిగాడికి స్థలం దొరకలేదు. కాలికి, బద్దలు బిగించారు. నెత్తికికూడా ఒకకట్టు కట్టి ప్రతివారం రమ్మని చెప్పిపంపారు. అప్పటినుండీ ప్రతిరోజూ రామివెళ్ళి మందు పట్టకొస్తూంది. తలకు తగిలిన గాయం మానుబారుతూంది; కాని కాలుమాత్రం ఏమీనయంకాలేదు. ఇప్పటికేరెండువారాలయింది. రెండుసార్లు కట్టువిప్పి తిరిగి కట్టారు. తను ఇంట్లో పడిఉంటూ భార్యకు కష్టంకలిగిస్తున్నాననే బాధ మిక్కుటంగా ఉంది వానికి. తను చనిపోయినా బావుండేది. తల్లీ కొడుకులు కొంచెం బాగా తినేవారు అని వాని హృదయంలో ఆవేదన.

పదిగంటల వరకు పనిచేసి, ప్రతిఫలంగా వాళ్లు పెట్టిన కొంచెం అన్నం తీసుకుని పదిన్నరకల్లా గుడిసెదగ్గరి కొచ్చింది రామి. లోపల్నుంచి మూలుగుతున్న శబ్దం విన్పడేసరికి రామికి గుండెలు దడదడా కొట్టుకున్నయ్. లోపలికెళ్ళి చూసేసరికి ఇంకేముంది! సత్తిగాడు మంచంవిరిగి క్రిందపడ్డాడు. వాడు బాధతో మూల్గుతున్నాడు. కళ్ళవెంట నీళ్ళుకారి, ఎండిపోయిన చారలు చూసేసరికి ఎంత సేపట్నుంచి వాడలా పడిఉన్నాడో తెల్సుకోటం కష్టమే అయింది. దగ్గరికెళ్ళి ఏడుస్తూ "ఏం సేపయింది ఇట్లాపడి? ఎలాపడ్డావు?" అని ఆత్రుతతో ఏమీతోచక ప్రశ్నిస్తూ విరిగిన మంచంవైపు చూసి "అయ్యో, మంచం పుచ్చిపోయింది." అని అతని ఫాలంపై చేయిఉంచి మెల్లిగా రాస్తూ "ఇదుగో, నేనొచ్చాను." అంది.

బాధతో మూల్గుతూన్న సత్తిగాడు ఆమె చేయి తగిలి కళ్లుతెరచి, అంతకు ముందే మంచం పుచ్చిపోయిందని భార్య అన్న మాటల్ని వినిఉండటంవల్ల "మంచం ఒకటేనా? మన బతుకులుగూడా పుచ్చిపోయినయి. పుచ్చిపోయిన బతుకుల్ని మోయటం మంచానికేగాదు: దేవుడికిగూడా బరువే." అన్నాడు బాధతో.

రామికి వానిమాటల్లోని అర్థాన్ని తెలుసుకునేంత తీరికలేదు. "ఎంతసేపయింది ఇట్లాపడి? ఇదుగో నన్నుపట్టుకో కొంచంలేచి భూమ్మీద పడుకుందువుగాని." అంటూ అతని ఎడంచేయిని తన భుజంమీద వేసుకుంది పిల్లాడిని ప్రక్కనదింపి.

సత్తిగాడు సాధ్యపడదన్నట్టు తలాడించాడు. "ఊహుం నావల్లకాదు. కాలు చాలా బాధగా ఉంది. పక్కగుడిసెలో ఎవరేనా ఉన్నారేమో. సాయం పిల్చుకో" అన్నాడు రామి సత్తిగాడి కాలివైపు చూసింది. "అయ్యో రక్తం" అని బిగ్గరగా అరచి పొంగివస్తూన్న దుఃఖాన్ని దిగమింగుతూ వెళ్ళి ప్రక్కగుడిసెలోంచి ఒకడిని సాయం తెచ్చింది. ఇరువురూకలిసి మంచం ప్రక్కకు సత్తిగాడిని తీశారు. ఆసుపత్రికి తీసుకెళ్ళటానికి రిక్షా తీసుకురా వెళ్లాడు అతడు.

"బుల్లోడికి బువ్వ తిన్పించావా?" అడిగాడు

"ఆఁ తిన్పించా. ఈ రోజు వాళ్ళు కొంచెం పాలు కూడా పోశారు. తాగించా" అని సమాధాన మిచ్చింది సత్తిగాని కాలికట్టును సర్దటానికి యత్నిస్తూ.

"అబ్బ! దాన్ని ముట్టుకు నొప్పెడుతూంది. ఏదీ ఇటురా ఒకసారి" సత్తిగాడు పిలువగానే రామి వాని తలదగ్గరికి జరిగివచ్చింది. "మళ్ళీ నెత్తురు కారింది. క్రిందపడగానే అరిస్తే ఎవ్వరూ రాలేదు. ఎంత బాధయిందో తెలుసా!" రామి కళ్ళలోంచి అశ్రువులు జలజలా రాలాయి. "ఏడుస్తావెందుకు? బాధలు మనుష్యులకే వస్తాయి. నేను సచ్చిపోతా ననే భయంలేదు. కాని మీగతి ఏమవుతుందని అని విచారం. అయినా, నేను బతికిమాత్రం ఏం చేయాలి? మళ్ళీ రిక్షా తొక్కుతానా, మిమ్మల్ని సుకపెడ్తానా? ఏమైనా నీపైన్నే ఆధారం. పోనీ, ఒకవేళ నేను బతికి కాలు గట్టిపడితే రోజూ బాగా సంపాదిస్తాను. మీతోనే ఉండాలని ఉంది. కాని...ఎవడి బతుకు వాడు బతికితే గొప్పకాదు ఇతరులకొరకు బతికితేనే దేముడు మెచ్చుతాడు. మనకు రోజూ ఎట్లాగో గడిచేది. కాని సరిగ్గా తిండిలేనివాళ్ళను రోజూ చూస్తానుకదా! వాళ్ళకు రిక్షామీద కనీసం ఇద్దరు మనుషులను ఎక్కించు కునేందుకు వీల్లేకపోతే ఏం సంపాదిస్తారు? ఏం తింటారు? నాకొరకు కాకపోయినా, నలుగురి కొరకు, వాళ్ళబాధ సూడలేక వాళ్ళ ఇష్టంమీదనే సమ్మె చేయించా. దానికి ఫలితం ఇది. అయినా ఫరవాలేదు. రేపోమాపో సర్కారువాళ్ళు ఒప్పు కుంటారు. అందరూ సంతోషిస్తారు. కాని నేనో, నాకేమీ భయంలేదు. నేనొక్కడిని సస్తే ఏం?" రామి వింటూందో లేదో గ్రహించకుండానే తన గొడవ తాను చెప్పుకుపోయాడు. ఆమె వింటూ కళ్ళనుండి నీళ్ళు కారుస్తూంది. అవి చెక్కిళ్ళపై నుండి జారి అతనిమీద పడుతున్నాయి. వేడి కన్నీళ్ళ స్పర్శ తగులగానే "ఇంకా ఏడుస్తున్నావా? ఊరుకో" అని కళ్ళనీళ్ళు తుడిచాడు.

"ఆయన రిక్షా తెచ్చేసరికి నాలుగు మెతుకులు తిను. రాత్రి గూడా తిన్నేలేదు" అంది. సత్తిగాడు అక్కరలేదన్నాడు. "నువ్వు తిను. నా కాకలి గాలేదు" అన్నాడు. ఆమె గూడా తినలేదు. అంతట్లోనే వెళ్ళిక వ్యక్తి రిక్షా తీసుకువచ్చాడు.

సమ్మె సాగినన్నిరోజులు పట్టణమంతా గందర గోళంగా ఉంది. బస్సుస్టాండులవద్ద 'క్యూ'లు మైళ్ళ పొడవునా పెరిగాయి. ఉద్యోగులు కార్యాలయాలకు పోవటంలో ఆలస్యం. అంతా అస్తవ్యస్తంగా పరిణమించింది.

క్రిందటివారం మంచమ్మీనుంచి క్రిందపడిన సత్తిగాణ్ణి ఆసుపత్రికి తీసికెడితే డాక్టరు కట్లువిప్పి తిరిగి కట్టారు. అట్టే ప్రమాద మేమీలేదని నచ్చ చెప్పి ఇంటికి పంపారు. ఆరు రోజులు గడిచినయి.

గత రోజుల రిక్షావాళ్ళు మాట్లాడుకున్నారు ప్రభుత్వం శాసనాన్ని రద్దుచేయనుందని. ఆ విష యం భర్తతో చెప్పింది రామి. సత్తిగాడు సంతోష పడ్డాడు. కాని తన స్థితి తలంచుకునేసరికి గుండె జారిపోయింది. భార్య దిగులుపడుతుందనేభయంతో తన బాధను బయటికి వ్యక్తపరచలేదు.

"కాలు విరిగిన అవతలివైపున ఇప్పుడేమీ అని పించటం లేదే. నువ్వు చేత్తో తాకినా, అక్కడ ఏదైనా వారాడినా నాకు ఏమికాదు పూర్తిగా ఊడిందో ఏమో" అనుమానం వెలిబుచ్చాడు సత్తిగాడు "ఊడిపోతే ఏంచేస్తావ్?" అనడిగాడు. సమాధానం వెతుకుతున్నాడు పెళ్ళాం ముఖంలో.

"ఇదిగో నీ వెప్పుడూ సచ్చి పోతానంటావు నన్ను బెదిరిస్తున్నావా? నీకంటే నాకేబాగా చాత నవు చావటానికి ఏమనుకోమన్నావో" అంది రామి కోపంతో. ఆమెకీ చావు, చావు తరువాత బ్రతికున్నవాళ్ళ జీవన సమస్యలను వినివినీ విసు గొచ్చింది. ఆమె మనస్సులో ఒకవైపున దుఃఖాన్ని రాజుతూంది. దానికి మళ్ళీ గాలిలా సత్తిగాని మాటలు. ఆ దుఃఖంలోంచి పెకలివచ్చిన మాటలు కోపరూపకం దాల్చినయి. కన్నీళ్ళు కన్పడతాయేమోనని ముఖాన్ని పైట చాటున దాచుకుంది. ఆ ముఖంలోని భావం సత్తిగాని కవగతం కాకుండా ఉండలేకపోయింది.

ఆమెను దగ్గరికి తీసుకుని "ఇటు చూడు, నిజంగా నాకు చావాలని కోరిక ఉందనుకుంటావా? నా ప్రాణం నాకు అందరిలాగే తీపి. మీరు లేకుండా నాకు స్వర్గం ఇచ్చినా తీసుకోను. ఏడవకు. ఊరికే అన్నాను. అంతే. తొందరలోనే బాగవుతా. తప్పకుండా" అని బుజ్జగించాడు. ప్రక్కనే ఉన్న కొడుకుని ఎడంచేత్తో దగ్గరికి తీసుకుని ముద్దుతీసుకున్నాడు.

"ఇక్కడున్నంతకాలం ఇంతే. ఈరోజు ఆసు పత్రి కెళ్ళాలిగదా. డాక్టరుగారిని అడుగుతా

ఎట్లాగైనాచేసి అక్కడే ఉంచుకోమని కాళ్ళావేళ్ళాపడి అడుక్కుంటూ." అని తన నిశ్చయాన్ని తెలిపింది. సత్తిగాడు పొడిగా నవ్వాడు పెళ్ళాం కోరిక డాక్టరు నెరవేరుస్తాడా అన్నట్లు.

"రిక్షావచ్చింది. ఇక ఎల్దాం" అంది, రామి గుడిసెముందర నిలబడిన రిక్షాను చూపిస్తూ రిక్షా తెచ్చినవ్యక్తి వచ్చాడు. అతడూ, రామి ఇరువురూ కలిసి సత్తిగాడిని ఎత్తుకెళ్ళి మెల్లిగా రిక్షాలో కూర్చోబెట్టారు. రిక్షా మెల్లిగా నడిచింది.

"ఏంరా, ఎంతదాక వచ్చింది. నిన్నేదో వింటి. నిజమేనా?" అని అడిగాడు రిక్షా తొక్కుతూన్న వానిని. "ఔనన్నా. ఇయ్యాల మాపటికి పూర్తి అయిపోతుంది. ఇక రేపట్నుంచి మనమాటే" అన్నాడతడు.

సత్తిగాని హృదయంలో ప్రళయం రేగింది. రేపట్నుంచి అందరూ సంపాదించటం ప్రారంభిస్తారు. కాని మరితను? ఇంకా కాలుతోనే వేగుతున్నాడు. ఎన్నడు బాగుపడాలి? ఎన్నడు సంపాదించాలి? తను బాగుపడేదాకా సంసారం ఎట్లా గడుస్తుంది? ఎట్లాగైనా త్వరగా బాగవాలి. భార్య డాక్టరును అడుగుతానంది. తనూ అడగదలుచుకున్నాడు. "మంచిదయింది తమ్ముడూ, ఇకనుంచైనా కొంచెం కడుపునిండా గంజినీళ్లు దొరుకుతాయి" అన్నాడు.

ఆసుపత్రికి వెళ్ళాక డాక్టర్లను రామి దీనంగా వేడుకుంది అక్కడే ఉంచుకుని త్వరగా కుదిరించండని. సత్తిగాడుకూడా చెప్పుకున్నాడు తన బాధ. డాక్టర్లు కాలికట్లు విప్పి చూసి ఏమో మాట్లాడుకున్నారు ఇంగ్లీషులో. అది సత్తిగాడికి, రామికీ ఇరువురికీ తెలియనిభాష: రామిని అక్కడే ఉండమనిచెప్పి సత్తిగాడి నొక్కడినే త్రోపుడు బండిపై లోపలికి తీసుకెళ్ళారు. రిక్షామనిషి వెళ్ళిపోయాడు. రామి రెండు మూడు గంటలవరకు అక్కడే నిలబడింది. బుల్లోడు కొంచెంసేపు ఏడ్చి నిదురోయాడు.

ఒక డాక్టరు నర్సుతో వచ్చాడక్కడికి. 'రామ్మా మీ ఆయన్ను చూద్దువుగాని'అంది నర్సు. ఆదుర్దాగా వెంబడించింది. ఉండబట్టలేక పోతూంటే డాక్టరును అడిగింది. "అయ్యగారూ ఎట్లావుంది ఆయనకు?" అని.

ఆమె ఆత్రుతను చూసి "ఏమీలేదమ్మా, కాలు మురుగుడు చూపింది. దాన్నలాగే ఉంచితే అసలు మనిషికే ప్రమాదం. అందుకే కాలును తీసివేశాం. ఇక ఏమీ భయంలేదు. తప్పకుండా బ్రతుకుతాడు" అన్నాడు డాక్టరు.

కాలు తీసేశారనటంతోనే రామి గుండెలో అగ్నిపర్వతం బ్రద్దలయింది. ఏడ్చుకుంటూ పరుగెత్తింది లోపలికి అందరూ ఆపుచేశారు. ఎట్లాగైనా బ్రతుకుతాడు కదా అనే ఆశకొద్దీ కొంచెం అణచుకుంది దుఃఖాన్ని.

రామివెళ్ళిన అయిదు నిమిషాలకు సత్తిగాడు కళ్ళుతెరచాడు. దగ్గరే కొడుకునెత్తుకుని నిలుచుని ఉన్న భార్యనుచూసి సంతోషించినాడు. తనకిప్పుడు బాధ అంతగాలేదు. ప్రక్కనున్నవాళ్ళ ఊతతో కొంచెంలేచే సరికి తనకాలు కన్పడలేదు. మోకాటివరకే ఉంది. అక్కడ గుడ్డలు చుట్టబడి ఉన్నాయి. "ఆఁ కాలుతీసేశారా" అని అరిచాడు భయంతో. కళ్ళను అదోమాదిరిగా విప్పి పైకి చూస్తున్నాడు. "ఏమిటి? ఏం భయంలేదు. బాగవుతుందట." అని సారె సారెకు ఊపింది రామి. కాని సత్తిగాడిక పలకలేదు. అతని శరీరం మంచంపైన వాలిపోయింది. రామి భోరున ఏడ్చింది. ఆ ఏడ్పుకు బుల్లోడు లేచాడు కాని వానికేమీ అర్థం కాలేదు.

ఆరోజు సాయంత్రం తమపట్టు నెగ్గుతుంది. తన జీవితానికి ఆధారం కాలు. దాన్నే తీసివేస్తే తనగతి ఏంకాను? బ్రతికిఉన్నా చచ్చినవానితో సమానమే కదా! చేతగాక భార్య సంపాదనపై బ్రతుకీడ్వాలి. ఈ విషయాలన్నీ జ్ఞాపకం వచ్చేసరికి వానికి గుండె ఆగిపోయింది.

రామి ఏడుస్తూ సాయంత్రం హాస్పిటలునుండి బయటకొచ్చింది. డాక్టర్లను తిట్టుకుంటే లాభమేంటి? వాళ్ళకు తెలిసినపని చేశారు. దుష్టాంగ ఖండన మొనరించి శిష్టాంగాన్ని పరిరక్షించటం వాళ్ళవిద్య.

ఒకవైపు సంతోషంతో సాగిపోతూన్న జనం, మరోవైపు తల్లి దైన్యాలోకం. బుల్లోడికి అది సుఖాంతమో దుఃఖాంతమో తెలియలేదు. కాని వాని తండ్రి ఆశయం ప్రకారం సుఖాంతమే నేమో!

★